క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గణేష్

అచ్యుతాపురం(మునగపాక): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అచ్యుతాపురం సీఐ ఎస్.గణేష్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణాపై దృష్టి సారిస్తున్నామన్నారు. కొన్ని చోట్ల యువత చెడు వ్యసనాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అచ్యుతాపురం జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత సన్మార్గంలో నడిచేలా పలు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ సుధాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



ఎస్ఐ ప్రసాదరావుతో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

మునగపాక: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఓ కేసు విచారణలో భాగంగా మునగపాక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. పెండింగ్ రికార్డులపై దృష్టి సారించాలని ఎస్ఐ ప్రసాదరావును ఆదేశించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలు విజయవంతంగా నడిచాయని, అదే రీతిలో దుర్గాదేవి అమ్మవారి ఉత్సవాలు ప్రశాంతంగా జరిపేందుకు సహకరించాలన్నారు. అలాగే కళాశాల విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు యువత దూరంగా ఉండాలన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



ఆక్సాహేబుపేటలో అవగాహన కల్పిస్తున్న లింక్ వర్కర్స్

కోటవురట్ల: ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఆక్సాహేబుపేటలో హెచ్ఐవీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రీసోర్స్ పర్సన్ ఎస్.గోవిందరావు మాట్లాడుతూ హెచ్ఐవీ లైంగికంగా సంక్రమించే వ్యాధి అన్నారు. రెండు నెలల పాటు మీకు తెలుసా కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా సకాలంలో చికిత్స తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది రామలక్ష్మి, ఆశ వర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం ఎంపీడీవోగా పి.రాధ



ఎంపీడీవో బాధ్యతలు చేపట్టిన రాధ

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం ఎంపీడీవోగా పి.రాధ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో రామచంద్రరావు గత నెల పదవీ విరమణ చేశారు. ఈ మేరకు ఆయన స్థానంలో బదీలీపై పద్మనాభం మండలం నుంచి వచ్చిన పి.రాధ బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

ప్రచార ఆర్భాటం.. విక్రయాలు నామమాత్రం

- అక్కరకు రాని ప్రభుత్వ నిత్యావసరాల విక్రయ కేంద్రాలు
- పట్టణంలో రెండు చోట్ల బియ్యం, కందిపప్పు అమ్మకాలు
- మార్కెట్‌లో కన్నా ప్రభుత్వ కేంద్రాల్లోనే ధరలు అధికం



పట్టణంలో కోమటిపేటలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ విక్రయ కేంద్రం

యలమంచిలి రూరల్: మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకే నాణ్యమైన సోనా, బీపీటీ బియ్యం, కందిపప్పు అందిస్తామని గొప్పగా చెప్పి యలమంచిలి పట్టణంలో ప్రభుత్వం ప్రత్యేక విక్రయ కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిల్లర్స్ అసోసియేషన్, మర్చంట్ అసోసియేషన్ సహకారంతో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో కోమటిపేట న్యూ ఫాతిమా స్టోర్స్, కోర్టుపేట వెంకటేశ్వరా ట్రేడింగ్ కంపెనీల వద్ద ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను ఈ ఏడాది జూలై 16న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. కిలో రూ.48, రూ.49 ప్రకారం సోనా మసూరి, బీపీటీ స్టీమ్, పచ్చి బీపీటీ రకాల బియ్యం, కిలో దేశవాళి కందిపప్పు రూ.150 చొప్పున ధరలు నిర్ణయించారు. ప్రజలకు సరసమైన ధరలకు అందుబాటులో బియ్యం, కంది పప్పు ఈ విక్రయ కేంద్రాల ద్వారా అమ్మకాలు జరుపుతామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఊదరగొట్టింది. అంతే ఆర్భాటంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనుకూలంగా ప్రచారం చేయించుకున్నారు. అయితే ప్రభుత్వం విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు ధరలకు, మార్కెట్లో ధరలకు పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో పాటు సరకుల నాణ్యత తక్కువగా ఉండడంతో ప్రజలు ఈ విక్రయ కేంద్రాల వైపు కన్నెత్తి చూడడం లేదు.

43 క్వింటాళ్ల బియ్యం..
14 క్వింటాళ్ల కంది పప్పు విక్రయం

యలమంచిలి పట్టణంలోని రెండు విక్రయ కేంద్రాల ద్వారా గత నెలాఖరు వరకు సుమారు 43 క్వింటాళ్ల బియ్యం, 14.90 క్వింటాళ్ల కందిపప్పు మాత్రమే విక్రయించడాన్ని చూస్తే ప్రజల్లో వీటికి ఆదరణ ఎలా ఉందో అర్థమవుతుంది. ఇందుకు ప్రధాన కారణం ప్రభుత్వం విక్రయిస్తున్న ధరలకు, బయట మార్కెట్‌లో విక్రయిస్తున్న ధరలకు పెద్దగా తేడా లేకపోవడమేనని స్థానికులు అంటున్నారు. దీంతో పట్టణంలో ఓ కేంద్రంలో పౌర సరఫరాల అధికారులు ధరల వివరాలతో ఏర్పాటు చేసిన బ్యానర్‌ను సైతం తొలగించేశారు. విక్రయించినట్టు చూపుతున్న బియ్యం, కందిపప్పు వివరాలు కూడా రోజువారీ హోల్‌సేల్, రిటైల్ కొనుగోళ్లవేనని సమాచారం.

తక్కువ ధరలకు అందించాలి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాల్లో బియ్యం, కందిపప్పు ధరలు, బయట మార్కెట్ ధరలకు పెద్దగా తేడా లేదు. ఇలా అయితే ఈ కేంద్రాల వల్ల ఉపయోగం ఏమిటో అర్థం కావడంలేదు. సరసమైన ధరలకు నిత్యావసర సరకులు అందజేస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం ఈ కేంద్రాల పనితీరుపై ఓ సారి సమీక్ష జరిపి మార్కెట్ ధరలను బట్టి అంతకంటే తక్కువ ధరకు నిత్యావసరాలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– కందికుప్పు గోవిందరావు, యలమంచిలి

విక్రయ కేంద్రాలు అందుబాటులో ఉండాలి



ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాలు ఎక్కడున్నాయో ఎవరికీ తెలీదు. నిజంగా ప్రజలకు సరసమైన ధరలకు నిత్యావసరాలు అందజేద్దామని ప్రభుత్వానికి ఉంటే చిత్తశుద్ధితో విక్రయ కేంద్రాలను నిర్వహించాలి. తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పుతో పాటు కూరగాయలను కూడా అందించాలి. అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

– బండారి కరుణ, టిడ్కో కాలనీ, యలమంచిలి

బయట మార్కెట్‌లోనూ అదే ధర

బయట మార్కెట్‌తో పోల్చుకుంటే ప్రభుత్వ విక్రయ కేంద్రాల్లో సరసమైన ధరలకు బియ్యం, కందిపప్పు అందుబాటులో ఉంటాయని అధికారులు ప్రకటించారు. కిలోపై కనీసం రూ.15 నుంచి రూ.20 వరకు తక్కువగా ఉంటుందని చెప్పారు. కానీ బయట మార్కెట్‌లోనూ దాదాపు అవే ధరలు ఉన్నాయి. కందిపప్పు కిలో రూ148లకే బయట మార్కెట్‌లో లభిస్తుండగా.. ప్రత్యేక కేంద్రాల్లో కిలో రూ.150కి విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులు రాకపోయినా వచ్చినట్టుగా తమ రికార్డుల్లో చూపుతున్నారు వ్యాపారులు.

కిలో బియ్యం రూ.40, కిలో కందిపప్పు రూ.140 ఉంటే విక్రయ కేంద్రాలకు ప్రజలు వస్తారని మరో వైపు కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొంతైనా రాయితీ భరిస్తే ఇలాంటి వాటివల్ల ప్రజలకు ఒకింత ప్రయోజనం ఉంటుందని పేద వర్గాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

దసరా పొట్టేళ్లకు గిరాకీ



అచ్యుతాపురం సంతలో పొట్టేళ్లు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం వారపు సంత శుక్రవారం కళకళలాడింది. ఈ నెల 12న విజయదశమి కావడంతో పొట్టేళ్లకు గిరాకీ ఏర్పడింది. పలు ప్రాంతాల నుంచి అమ్మకందారులు వారపు సంతకు మేకలు, గొర్రెలను తీసుకువచ్చారు. దీంతో కొనుగోలుదారులు వాటిని కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. పొట్టేళ్ల శౌష్టవాన్ని బట్టి ధరలు నిర్ణయించారు. రూ.14 వేల నుంచి రూ.30 వేలకు పైబడి పొట్టేళ్ల అమ్మకాలు జరిగాయి.

పశు వైద్య శిబిరానికి స్పందన

కోటవురట్ల: పాడి పశు సంరక్షణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు సూచించారు. పందూరులో ఉచిత పశు గర్భకోశ వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఈ శిబిరంలో 61 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 6 పశువులకు శస్త్ర చికిత్స, 78 పెయ్యలకు నట్టల నివారణ మందు, 120 జీవాలకు పీపీఆర్ వ్యాక్సినేషన్, 146 జీవాలకు గాలికుంటు వ్యాధి టీకా, 38 పశువులకు సాధారణ చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ పి.నరేష్, పశు వైద్యులు ఆర్.ప్రతాప్‌కుమార్, బాబూరావు పడాల్, సురేష్, హరిప్రియ, సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ సూరిబాబు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెడుగుడు విజేత సోమలింగపాలెం జట్టు



సోమలింగపాలెం జట్టు నాయకుడికి మొదటి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

యలమంచిలి రూరల్: జంపపాలెంలో మరిడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి చెడుగుడు పోటీల విజేతగా యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం జట్టు నిలిచింది. జంపపాలెం, గణపర్తి, వాడ్రాపల్లి, చూచుకొండ జట్లు రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. మొత్తం 16 జట్లు పాల్గొన్న ఈ పోటీలు 3 రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు శుక్రవారం రాత్రి బహుమతులు అందజేశారు. ఆళ్ల వెంకట శివ, పెంటకోట శివ పోటీల నిర్వహణ, బహుమతులకు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిలపరశెట్టి దేవకినాయుడు, టిక్కలి శివ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆయకట్టు శివారు భూములకూ నీరందిస్తాం

- తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ



తాండవ ప్రాజెక్టు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న డీఈ అనురాధ, జేఈ శ్యామ్‌కుమార్

నాతవరం: తాండవ రిజర్వాయర్ నుంచి ఆయకట్టు శివారు భూములకు కూడా నీరు అందించేందుకు దృష్టి సారించినట్టు తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. తాండవ రిజర్వాయర్‌లో నీటి మట్టాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాండవ రిజర్వాయర్‌లో నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 378.4 అడుగులు ఉందన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో 335 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి వస్తోందని చెప్పారు. ఖరీఫ్ పంటకు కాల్వల ద్వారా రోజు 550 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఈఏడాది వాతావరణం బాగుందని, వర్షాలు అధికంగా కురవడంతో ప్రాజెక్టులో నీటి మట్టం బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఈ శ్యామ్‌కుమార్, ప్రాజెక్టు సిబ్బంది ఉన్నారు.

ఉచిత ఇసుక హామీ అమలు కోసం ఆందోళన



అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు



నాగవరం సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మునగపాక: ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని కోరుతూ శుక్రవారం మండలంలోని నాగవరం సచివాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు అందరికీ ఉచిత ఇసుక అంటూ హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చాక విస్మరించారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకపోవడంతో పస్తులతో అలమటిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఇసుక హామీ అమలు కాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు పాలిపిని అప్పారావు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(మునగపాక): ఉచిత ఇసుక విధానం అమలు కోసం అచ్యుతాపురం రెవెన్యూ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ రాము మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు ఎన్నికల ముందు చంద్రబాబు ఉచిత ఇసుక పథకం అమలు చేస్తామంటూ హామీ ఇచ్చి, ఇప్పుడు మోసం చేశారన్నారు. ఇసుక అక్రమ రవాణా పెరిగిపోతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. అందరికీ ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్రి అప్పారావు, రాజాన అప్పలనాయుడు, రమేష్, రాజు, మేరుగు నూకరాజు, చేపల తాతయ్య, ఆర్.లక్ష్మి, కూండ్రపు సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రాంబిల్లి తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నేతలు

రాంబిల్లి(యలమంచిలి): ఉచిత ఇసుక అందించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ సీపీఎం నేతలు భవన నిర్మాణ కార్మికులతో కలిసి రాంబిల్లి తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.35 లక్షల కుటుంబాలు, మన జిల్లాలో లక్షన్నర కుటుంబాలు ఇసుక లేక అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారాయణరావు, రాము, నూకరాజు, గంగరాజు, కోదండరావు, పవన్‌కుమార్, భవన నిర్మాణ సంఘం నాయకులు రామకృష్ణ నాగేంద్ర, మంగరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



ఉపమాకలో బోనాలు సమర్పిస్తున్న భవానీ భక్తులు

నక్కపల్లి: ఉపమాక గ్రామంలో శుక్రవారం బోనాల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఉపమాకతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భవానీ భక్తులు నెత్తిన బోనాలు పెట్టుకుని భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు దుర్గదేవి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఈ ఊరేగింపును అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. దుర్గా భవానీ పీఠం వద్ద ప్రారంభమైన ఈ బోనాల ఊరేగింపు ఉపమాకలో అన్ని వీధుల్లోనూ కొనసాగింది. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద దుర్గాదేవికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గురు భవానీలు రాంబాబు, కేవి సత్యనారాయణ, అప్పలచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ దేవీ అలంకరణలో దుర్గమ్మ

మునగపాక: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలో పలుచోట్ల కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారు శుక్రవారం శ్రీగాయత్రీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఒంపోలులో శ్రీగాయత్రి దేవీ అలంకరణలో ఉన్న దుర్గమ్మను ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. సాయంత్రం పలు చోట్ల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాటం

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం జగన్నాథపురంలో శుక్రవారం దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా భవాని భక్తులు ఘటాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. జై దుర్గా.. జైజై దుర్గా అంటూ భక్తులు నినదించారు. ఘటాల ఊరేగింపు గ్రామంలో అన్ని వీధుల మీదుగా సాగింది.



జగన్నాథపురంలో ఘటాల ఊరేగింపులో కోలాటం

అలరించిన సంకీర్తనలు

మునగపాక: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీవిశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సంకీర్తనలు అలరించాయి. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కళాకారులు ఆలపించిన పలు గీతాలు భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల రమణ గణేష్, కోశాధికారి బొడ్డేడ రమణ, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మునగపాకలో సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని గాంధీనగరం ఆధ్యాత్మిక గాయత్రీ జ్ఞానపీఠంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. వైష్ణవీదేవిగా, కామాక్షిదేవిగా, శారదాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. పలుచోట్ల భవానీ భక్తులు భజనలు చేశారు.

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు, గెడ్డపాలెం, పి.ధర్మవరం, కొరుప్రోలు, దార్లపూడి గ్రామాల్లో దుర్గమ్మ రెండో రోజు శుక్రవారం గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాలధారణ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యలమంచిలి గాంధీనగరం ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



గెడ్డపాలెంలో గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గమ్మ

జీవకారుణ్య సంఘానికి పూర్వ వైభవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన సలహాదారు సత్తిబాబు

రోలుగుంట: జీవకారుణ్య సంఘానికి పూర్వవైభవం తీసుకువస్తామని జీవకారుణ్య సంఘం సలహాదారుడు సత్తిబాబు తెలిపారు. మండలం కేంద్రంలో శిథిలావస్థకు చేరిన జీవకారుణ్య సంఘం భవనాన్ని సుమారు రూ.12 లక్షల వ్యయంతో పునర్నిర్మించారు. నిర్మాణం పూర్తయిన తరువాత తొలిసారిగా శుక్రవారం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఈ భవన నిర్మాణానికి రూ.5 లక్షల ప్రభుత్వ నిధులు, జెడ్పీటీసీ పోతర లక్ష్మి రమణమ్మ తన కోటా నిధుల నుంచి రూ.2.5 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ఆ నిధులతో 2023 లో నిర్మాణ పనులు చేపట్టమన్నారు. శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం భక్తుల సహాయ నిధి, సంఘ సంభ్యుల సొంత సొమ్ము కలిసి సుమారు రూ.12 లక్షల వ్యయంతో ఈ భవన నిర్మాణం పూర్తయిందని చెప్పారు. అనంతరం గత నెల మరణించిన సంఘం ప్రధాన సలహాదారుడు మద్దు గైరమ్మ సత్యం మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సంఘం సభ్యులు కొట్టే పైడియ్య నాయుడు, ఫీల్డ్‌మెన్ సత్తిబాబు, మద్దు రాజగోపి, కొట్టే సంజీవరావు, మాకిరెడ్డి శ్రీను, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

అనకాపల్లి: మండలంలోని రేబాక గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. రేబాక గ్రామానికి చెందిన ఎం.సత్తిబాబు బెల్టు దుకాణం ద్వారా మద్యం విక్రయిస్తుండగా శుక్రవారం పట్టుకున్నామన్నారు. 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలపై సమచారం ఉంటే తమకు తెలియజేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో పి.ధర్మవరం ఫీడర్‌లో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ లైన్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.